# కేసీఆర్‌తో జిల్లా మరింత అభివృద్ధి

## బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం


కామాచారెడ్డి పట్టణంలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి


పెద్దమల్లారెడ్డిలో ప్రచారం చేస్తున్న గంప శశాంక్

కామారెడ్డి/భిక్కనూరు/రాజంపేట్/మాచారెడ్డి/దోమకొండ, నవంబర్ 17 : కామారెడ్డి నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ భారీ మెజారిటీతో గెలిస్తే జిల్లా మొత్తం మరింత అభివృద్ధి సాధిస్తుందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కేసీఆర్ తరపున శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతోపాటు పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. జిల్లా కేంద్రంలోని 14,35వ వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సబ్బని కృష్ణహరి, కౌన్సిలర్ గోదావరి, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో రాష్ట్ర యువ నాయకుడు గంప శశాంక్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ యూత్ విభాగం అధ్యక్షుడు రంజిత్ వర్మ, జంగబోయి నర్సింహులు, ఎర్రోళ్ల స్వామి, నర్సింహులు, ఇస్మాయిల్, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట మండల కేంద్రంలో నాయకులు గుర్రాల రవి, గంగాధర్, కార్యకర్తలు ప్రచారం చేశారు. మాచారెడ్డి మండలం గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలో సర్పంచ్ హంజీనాయక్ ఆధ్వర్యంలో జోరుగా ఎన్నికల ప్రచారం కొనసాగింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లక్ష్మారెడ్డి, తోకల కిషన్, శ్రీధర్‌రావు, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. దోమకొండలో నాయకులు తిర్మల్‌గౌడ్, బుర్రి రవి, నాగరాజు, నర్సింహులు, అంబారీపేట్‌లో ఎంపీటీసీ ఫిరంగి రాజేశ్వర్, నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు.




రాజంపేట, గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్, అంబారీ పేట్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## బీఆర్ఎస్ పార్టీలో పలువురు చేరిక


మంత్రి కేటీఆర్‌తో గణేశ్‌నాయక్

మాచారెడ్డి, నవంబర్ 17 : కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నూనవత్ గణేశ్‌నాయక్ గురువారం రాత్రి హైదరా బాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనకు మంత్రి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**ఎంపీపీ నర్సింగ్‌రావు సమక్షంలో..**

మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి వంద మంది మహిళలు ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీపీ గులాబీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ముత్యాల నర్సింహారెడ్డి, శ్రీధర్‌రావు, భూక్య నర్సింహులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పర్‌పల్లికి చెందిన 49 మంది..**

బీబీపేట్, నవంబర్ 17: బీబీపేట్ మండలంలోని జనగామ గ్రామంలో శుక్రవారం కామారెడ్డి నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పుర్‌పల్లి గ్రామానికి చెందిన 49 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రాసేనారెడ్డి, ఎంపీపీ బాలమణి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు సైదుగారి అశోక్‌గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. గురువారం రాత్రి తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి సమక్షంలో జనగామ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దండుగుల స్వామి, జనరల్ సెక్రటరీతోసహా కార్యకర్తలు, ఒడ్డెర సంఘం సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


సుభాష్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఉప్పర్‌పల్లి కాంగ్రెస్ నాయకులు

## ఓటర్లకు స్లిప్పులు, గైడ్‌లు పంపిణీ చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి, నవంబర్ 17 : ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్పులు, ప్రతి కుటుంబానికి ఒక ఓటరు గైడ్ పుస్తకం పంపిణీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సెక్టోరల్ అధికారులకు సూచించారు. కామారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సెక్టోరల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఓటరు స్లిప్పుల పంపిణీ, సీ-విజిల్ యాప్ ప్రాముఖ్యత, 30న పోలింగ్ రోజు తప్పక ఓటు వేయడం తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. 30న ఓటర్లందరూ తమ బాధ్యతగా ఓటు వేసేలా బూత్ స్థాయి అధికారులు అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ రోజు అదనపు ఈవీఎంలతో ప్రెసిడెంట్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు అందుబాటులో ఉండి ఏ సాంకేతిక సమస్య తలెత్తిన పరిష్కరించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే ఈ నెల 23, 24 న ఈసీఐఎల్ నుంచి వచ్చే ఇంజినీర్లతో సందేహాలను నివృత్తి చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ లత, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

## రాష్ట్ర ప్రత్యేక సాధారణ పరిశీలకులు

కామారెడ్డి, నవంబర్ 17 : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రత్యేక సాధారణ పరిశీలకుడు అజయ్ వినాయక్ జిల్లా యంత్రాంగానికి సూచించారు. శుక్రవారం పోలీసు ప్రత్యేక పరిశీలకుడు దీపక్ మిశ్రాతో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూశర్మ, సాధారణ పరిశీలకులు చిఫాంగ్ అర్తుర్ వర్చుయో, జగదీశ్, పోలీసు పరిశీలకులు అబ్దుల్ ఖయ్యూమ్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకులు మాట్లాడుతూ.. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేలా బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించాలని సూచించారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా తగిన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. అనంతరం జిల్లాలోని ఎన్నికల ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. జిల్లాలో 239 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగిన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 21, 22వ తేదీల్లో సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.4కోట్ల 31 లక్షల నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వెల్లడించారు.


మాట్లాడుతున్న భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రత్యేక సాధారణ పరిశీలకుడు అజయ్ వినాయక్, భారత ఎన్నికల కమిషన్ ప్రత్యేక పోలీసు పరిశీలకుడు దీపక్ మిశ్రా

## ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

కామారెడ్డి, నవంబర్ 17 : కామారెడ్డి డిపోలో గత నెల అత్యధికంగా కలెక్షన్లు తెచ్చిన కండక్టర్లతోపాటు డీజిల్‌ను పొదుపు చేసిన డ్రైవర్లకు శుక్రవారం ప్రగతి చక్ర అవార్డు, ప్రశంసా పత్రాలను మేనేజర్ ఇందిర అందజేశారు.


ఉద్యోగులకు అభినందన పత్రం అందజేస్తున్న డిపో మేనేజర్ ఇందిర

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బీబీపేట్, నవంబర్ 17: మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన మహేశ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, బాధితుడి చికిత్స కోసం జనగామ గ్రామానికి చెంది న ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 5 వేల ఆర్థిక సహాయం అందిచారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న సభ్యులు